గృహజ్యోతికి విద్యుత్ షాక్



సిద్దిపేటలోని ఎస్ఈ కార్యాలయం



- ● గిర్రున తిరుగుతున్న మీటర్లు ● ఉక్కపోతకు అల్లాడుతున్న ప్రజలు
- ● ప్రత్యామ్నాయంగా ఏసీలు, కూలర్ల వైపు మొగ్గు
- ● జిల్లాలో 5,91,262 విద్యుత్ కనెక్షన్లు
- ● వీటిలో 1,98,666 గృహజ్యోతి లబ్ధిదారులు
- ● వేసవి నేపథ్యంలో పెరిగిన విద్యుత్ డిమాండ్
- ● రెండు నెలల నుంచి పెరిగిన విద్యుత్ ఆదాయం
- ● మార్చిలో రూ. 23.11 కోట్లు, ఏప్రిల్‌లో రూ. 27.51 కోట్లు వసూలు
- ● 9 వేల మందికి పైగా గృహజ్యోతి లబ్ధిదారులపై ఆర్థిక భారం

సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ గృహజ్యోతి లబ్ధిదారు వేసవిలో ఉక్కపోతను తట్టుకోలేక గత నెలలో కూలర్‌ను కొనుగోలు చేసింది. నెల గడిచిన తర్వాత 200 యూనిట్లు దాటిందని బిల్లు చెల్లించాలని విద్యుత్ సిబ్బంది బిల్లు అందించారు. కొన్ని నెలలుగా ఉచిత విద్యుత్ బిల్లు వస్తుండగా, ఎండాకాలం పుణ్యమాని బిల్లు రావడంతో కొనుగోలు చేసిన కూలర్‌ను కాస్తా ప్యాక్ చేసి అటకెక్కించింది.

- సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 15

రెండు, మూడు నెలల నుంచి దండికొడుతున్న ఎండలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 9 నుంచి భానుడి ప్రతాపం చూపిస్తుండడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, ఎయిర్‌కూలర్లు, చల్లటి నీటి కోసం రిఫ్రిజిరేటర్లను ఆశ్రయిస్తున్నారు. కరెంటు విషయంలో గతేడాదికి పైగా జీరో బిల్లులతో ఉపశమనం పొందుతున్న పలువురు గృహజ్యోతి లబ్ధిదారులు, ఈ ఏడాది అనుకున్న దానికంటే ఎక్కువ యూనిట్లు విద్యుత్‌ను వినియోగించడంతో వారికి షాక్ కొట్టినంత పనైంది. జిల్లాలో కొన్నినెలలుగా ఎలాంటి విద్యుత్ బిల్లులు లేకపోవడంతో ఆనందం వ్యక్తం చేసిన పలువురు లబ్ధిదారులు, వేసవి సందర్భంగా వస్తున్న బిల్లులను చూసి ఆందోళన పడుతున్నారు.

విద్యుత్ కనెక్షన్లు 5,91,262

జిల్లావ్యాప్తంగా 5,91,262 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహానికి సంబంధించి విద్యుత్ కనెక్షన్లు 3,52,800, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు 44,989, వ్యవసాయ రంగానికి సంబంధించి 1,73,360 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇండస్ట్రీయల్, గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్ దీపాలు, వాటర్ వర్క్స్ సంబంధించి 20 వేలకు పైగా వరకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వినియోగించే 1,98,666 మంది గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులున్నారు. వినియోగదారులకు గానూ జిల్లావ్యాప్తంగా 180 విద్యుత్ సబ్‌స్టేషన్లు, దాదాపు 35 వేల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా గృహ వినియోగదారులకు విద్యుత్‌ను అందిస్తున్నారు.

పెరిగిన బిల్లులు

జిల్లాలో వినియోగదారులు వినియోగిస్తున్న విద్యుత్‌కు సంబంధించి సాధారణంగా ప్రతి నెలా బిల్లుల రూపంలో అధికారులు రూ.22 కోట్ల మేర వసూలు చేస్తున్నారు. ఈ బిల్లులు మార్చి వరకు కాగా, ప్రారంభమైన గృహజ్యోతి పథకంతో దరఖాస్తు చేసుకున్న 1,98,666 లబ్ధిదారులకు జీరో బిల్స్ వస్తున్నాయి. రెండు, మూడు నెలలుగా వీరిలో నుంచి దాదాపు 9,402 మంది గృహజ్యోతి లబ్ధిదారులు 200 యూనిట్లు దాటడంతో బిల్లులను అందజేశారు. విద్యుత్ వినియోగానికి సంబంధించి ఫిబ్రవరిలో వాడిన విద్యుత్‌కు, మార్చిలో 33.99 మిలియన్ యూనిట్లకు గానూ రూ. 23.11 కోట్లు, మార్చిలో వినియోగించిన విద్యుత్‌కు ఏప్రిల్‌లో 40.47 మిలియన్ యూనిట్లకు రూ.27.51 కోట్లు విద్యుత్ బిల్లులు వసూలు చేసింది. ఏప్రిల్‌కు సంబంధించి మేలో 42.90 మిలియన్ యూనిట్లకు రూ. 26.78 కోట్లను వసూలు చేశారు.

పొదుపుగా వాడుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించిన వినియోగదారులకు గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులను అందిస్తున్నది. ఎండాకాలం నేపథ్యంలో గృహజ్యోతి వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. ఫిబ్రవరి నెల విద్యుత్ బిల్లులకు సంబంధించి మార్చిలో 2,430 మందికి, మార్చి నెల విద్యుత్ బిల్లులకు సంబంధించి ఏప్రిల్‌లో 7,371 మందికి, ఏప్రిల్ నెల విద్యుత్ బిల్లులకు సంబంధించి 9,402 మందికి బిల్లులను అందించాం.

- టీ.ఆర్. చంద్రమోహన్, ఎస్ఈ, విద్యుత్ శాఖ, సిద్దిపేట

48 రోజులు..

రూ.90.09 లక్షలు

● మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపులు

చేర్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం కానుకలు, ఒడిబియ్యం, హుండీలెక్కింపులు చేపట్టారు. ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆలయ ముఖమండపంలో శివరామకృష్ణ భజనమండలి సభ్యులు కానుకలను లెక్కించారు. రూ90,09,170 నగదు, 0.96 గ్రాముల బంగారం, 9.50కిలోల వెండి, 14 క్వింటాళ్ల ఒడిబియ్యం, 14 విదేశీ కరెన్సీ నోట్లు లభ్యమయ్యాయి. ఈ ఆదాయం కేవలం 48 రోజుల్లో సమకూరింది. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన లెక్కింపులలో ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి, కాయిత మోహన్‌రెడ్డి, వలాద్రి అంజిరెడ్డి, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచార్యుడు పడిగ న్నగారి మల్లయ్య, పడిగన్నగారి ఆంజనేయులు, మహదేవుని మనోహర్, పడిగన్నగారి మల్లయ్య తదిరులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటిన దంపతులు

● పాపకు సింధూరం అనే నామకరణం..



సింధూరం

నంగునూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాదులను అంతమొందించడం కోసం భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసింది. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరు ఒక్కో లా దేశభక్తిని చాటుకున్నారు. ఇక నంగునూరు మండలం మగ్దుంపూర్‌కు చెందిన దంపతులు కూడా దేశభక్తిని చాటుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు వాసవి యాదమల్లు కుమారుడు, కోడలు విక్రమ్ -కావ్య శ్రీ దంపతులకు సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పాప జన్మించింది. భారత్ చేపట్టిన ఆపరేషన్‌కు మద్దతుగా యుద్ధంలో సైనికులు చూపించిన ధైర్యానికి వారు తమ పాప పేరును సింధూరంగా నామకరణం చేసి దేశభక్తిని చాటుకున్నారు. ఆ దంపతులను పలువురు అభినందించారు.

బాలికకు వేధింపులు..

సోదరుడిపై బ్లేడ్‌తో దాడి

చేర్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను తరచూ వేధిస్తుండటంతో ప్రశ్నించిన సోదరుడిపై బ్లేడ్‌తో దాడి చేసిన ఉదంతం సిద్దిపేట జిల్లా చేర్యాలలో గురువారం జరిగింది. తీవ్రంగా గాయపడిన యువతి సోదరుడు ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చేర్యాలకు చెందిన ఓ బాలికను స్థానికంగా పెట్రోల్ పంప్ ఏరియాకు చెందిన ఓ యువకుడు కొన్ని నెలలుగా ఫోన్‌లో వేధిస్తున్నాడు. దీంతో బాలిక సోదరుడు, అతని స్నేహితులు కలిసి వేధింపులు మానుకోవాలని సదరు యువకుడికి సూచించారు. అయినా తీరుమార్చుకోని ఆ యువకుడు తన స్నేహితుడితో బాలిక సోదరుడికి ఫోన్ చేయించి మాట్లాడేందుకు పెద్ద చెరువు కట్ట వద్దకు రావాలని చెప్పాడు. దీంతో బాలిక సోదరుడు, మరికొందరు యువకులు అక్కడి వెళ్లగా, వేధిస్తున్న యువకుడితో పాటు అతని స్నేహితులు కొందరు ఉన్నారు. వేధింపుల విషయంలో చర్చ జరుగుతున్న క్రమంలో మాటామాటా పెరిగి గ్యాంగ్‌వార్‌లా ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో బాలిక సోదరుడిపై యువకుడు బ్లేడ్‌తో దాడికి దిగడంతో తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించ చడంతో విచారణ చేపట్టారు. ఇరువర్గాలకు చెందిన 10మందిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో

త్రిసభ్య బృందం విచారణ

- ● మెప్మాలో నిధుల పక్కదారి అంశంపై సభ్యులను విచారించిన జిల్లా ఆడిటర్
- ● పక్కదారి పట్టినట్లు గుర్తింపు
- ● మరింత లోతుగా విచారణ..



గజ్వేల్‌లో మాట్లాడుతున్న జిల్లా ఆడిటర్ జయశ్రీ

గజ్వేల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీల పరిధిలోని మెప్మాలో జరిగిన నిధుల పక్కదారి అంశంపై కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆడిటర్ జయశ్రీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో జిల్లా ఆడిటర్ జయశ్రీ, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య, మెప్మా పీడీ హనుమంతరెడ్డి ఆయా గ్రూపు సభ్యులను పిలిచి విచారణ చేపట్టారు. గతంలో మెప్మా పీడీ సమర్పించిన నివేదికతో పాటు గ్రూపు సభ్యులకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మూడు గ్రూపులకు చెందిన సభ్యులు తమ వివరాలను అందజేసి, తమ ఆవేదనను చెప్పుకున్నారు. అనంతరం జిల్లా ఆడిటర్ జయశ్రీ మాట్లాడుతూ... మూడు గ్రూపులకు చెందిన సభ్యులకు సంబంధించిన వివరాలను సేకరించామన్నారు. ఒకటే రోజు అకౌంట్ ప్రారంభించి, లోన్‌ను మంజూరు చేసి సభ్యుల నుంచి విత్‌డ్రా చేసి వినియోగించుకున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పేద, నిరుపేద మహిళలు ఇందులో అన్యాయానికి గురైనట్లు గుర్తించామని, తామంగా పారదర్శకంగా విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. మెప్మాకు చెందిన అంశంలో బ్యాంకు అధికారుల పాత్ర ఉందని గుర్తించామని, బ్యాంకు అధికారుల పాత్ర లేనిది ఇదంతా సాధ్యం కాదన్నారు. ఎంత నగదు ఎక్కడి నుంచి ఎక్కడకు వెళ్లిందో మరింత లోతుగా విచారణ జరిపిన అనంతరం వివరిస్తామని తెలిపారు. ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యామని, మొదటి రోజున విచారణలోనే అక్రమాలు జరిగినట్లు గుర్తించామని పేర్కొన్నారు. నిరుపేద మహిళలకు అన్యాయం జరగనివ్వబోమని, తప్పనిసరిగా న్యాయం చేస్తామని తెలిపారు. ఆమె వెంట బాధితులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.



నంగునూరు మండల కేంద్రంలో బేస్‌మెంట్ స్థాయిలో ఆగిపోయిన ఇందిరమ్మ మోడల్ హౌస్




నంగునూరులో ఇందిరమ్మ మోడల్ భవనం నిర్మాణం కోసం మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

మోడలే ఇలా.. ఇల్లు ఎలా?!

● పునాదుల స్థాయిలోనే ఆగిన ఇందిరమ్మ మోడల్ హౌస్

నంగునూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టు కింద ఏదైనా నిర్మాణం మొదలుపెట్టినా.. పథకం ప్రారంభించినా లబ్ధిదారులకు మేలు చేకూరేలా అధికారులు పర్యవేక్షిస్తూ ఆయా పనులను త్వరగా పూర్తిచేయాలి. కానీ ఇక్కడ మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. నంగునూరు మండల సమాఖ్య కార్యాలయం ఎదురుగా జనవరి 18న మంత్రి కొండా సురేఖ ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఐదు నెలలు కావస్తున్నా నిర్మాణ పనులు బేస్‌మెంట్ స్థాయిలోనే ఆగిపోయాయి. నాగరాజుపల్లిలో నిరుపేదలు కొందరు నిర్మాణాలు చేపట్టా రు. నమూనా గృహాలు లేకపోవడంతో వారంతా అయోమయానికి గురవుతున్నారు. మోడల్‌హౌస్ నిర్మాణమే ఇలాఉంటే.. ఇక ఇళ్లను ఎలా పూర్తిచేస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇందిరమ్మ నమూనా భవనాన్ని పూర్తిచేసి లబ్ధిదారులకు సహకరించాలని కోరుతున్నారు..



కనులపండువగా హనుమాన్ తెప్పోత్సవం



హనుమాన్ తెప్పోత్సవంలో దుర్గాప్రసాద్ స్వామీజీ, హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో శ్రీ హనుమాన్ తెప్పోత్సవం కనులపండువగా సాగింది. అంతకుముందు పట్టణంలోని శ్రీరామరాజు రావిచెట్టు హనుమాన్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అఖిల భారత హనుమత్ దీక్ష పీఠాధిపతులు దుర్గాప్రసాద్ స్వామిజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో కోమటిచెరువు వరకు హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. రావిచెట్టు హనుమాన్ ఆలయం నుంచి లాల్‌కమాన్ చౌరస్తా, గాంధీ సర్కిల్, వేంకటేశ్వర ఆలయం, విక్టరీ చౌరస్తా, ఎన్సాన్‌పల్లి రోడ్ మీదుగా హనుమాన్ శోభాయాత్ర కొనసాగింది. అనంతరం కోమటి చెరువులో హనుమాన్ తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. భారత్ బలమైన దేశంగా, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. హనుమత్ దీక్షతో శక్తి కలుగుతుందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సిద్దిపేటలో హనుమాన్ దీక్షాదారులు ఉంటారన్నారు. మొదటగా దీక్షపరులకు బిక్ష ఏర్పాటు చేసింది కూడా సిద్దిపేటలోనే ఆయన గుర్తుచేశారు. అనంతరం దుర్గాప్రసాద్ స్వామీజీ భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. దీక్షా నియమాలు, పాటించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో రామరాజు హనుమాన్ ట్రస్ట్ సభ్యులు, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మా ఊరు ఏ పరిధిలో..

● వేములఘాట్ గ్రామ ప్రజల ఆవేదన

గజ్వేల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు అడ్రస్ కూడా ఇప్పటివరకు అధికారులు చెప్పడం లేదని, సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న తమకు దిక్కెవరంటూ మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన వేములఘాట్ గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీలోని వేములఘాట్‌లో గ్రామ ప్రజలు, పారిశుధ్య కార్మికులు గురువారం విలేకరులతో మాట్లాడారు. మల్లన్నసాగర్‌లో ముంపునకు గురైన వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లెపహాడ్, బ్రాహ్మణ బంజరుపల్లి, లక్ష్మాపూర్ గ్రామాలను తొగుట మండలం నుంచి ప్రభుత్వం తొలగించినట్లు అధికారులు వెల్లడించారని, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌ను తమ గ్రామాల విషయమై అడగగా, తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారన్నారు. అటు తొగుట మండలం నుంచి తొలగించి.. ఇటు మునిసిపల్‌లో విలీనం కాకపోగా ముంపు గ్రామాల అడ్రస్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సేవలను అందించడానికి ఇప్పటివరకు విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులను సైతం జిల్లా అధికారులు వేరే ప్రాంతాలకు బదిలీ చేశారని చెప్పారు. ఐదు నెలల నుంచి జీతాలు రాక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రి కల్పించుకుని తక్షణమే జీతాలు చెల్లించేలా చూడాలని కోరారు. ఒంటరి మహిళలు, 60 సంవత్సరాలకు పైబడి ఉన్న వృద్ధులకు కూడా ప్యాకేజీలు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా గతంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో వాటిని నిలిపివేశారని, వెంటనే వాటిని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మాపూర్ కనకయ్య, నాయకులు కోట బిక్షపతి, పురుషోత్తం రెడ్డి మాల్ పటేల్, జహంగీర్, దాతర్‌పల్లి నర్సింలు, సిద్దిపేట ఎల్లం, పెద్ది బాలకిషన్, కనకాగౌడ్, దొడ్ల చందు, పోతుగంటి శీను, ఎర్రవల్లి ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లెపహాడ్, బ్రాహ్మణ బంజరుపల్లి, లక్ష్మాపూర్ తదితర గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సును అడ్డుకున్న రైతులు

● నిషేధిత జాబితాలో నుంచి రైతుల భూములను తొలగించాలని ధర్నా



నందారంలో సదస్సును అడ్డుకుని నినాదాలు చేస్తున్న రైతులు

అక్కన్నపేట, మే 15(ఆంధ్రజ్యోతి): తాత ముత్తాతల కాలం నుంచి సీలింగ్ భూములపై ఆధారపడి సాగు చేస్తున్న వ్యవసాయ భూములను నిషేధిత జాబితాలో చేర్చారని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ రైతులు గురువారం అక్కన్నపేట మండలం నందారంలో భూభారతి రెవెన్యూ సదస్సును అడ్డుకున్నారు. రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరించాలని రైతులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం నుంచి వచ్చే రైతుబంధు రాక, బ్యాంకులో క్రాప్‌లోను ఇవ్వక, ఆపద వస్తే భూములు అమ్ముకోలేక అరిగోస పడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ ఓఎస్డీ శ్రీనివాస్‌రెడ్డికి రైతులు ఫోన్‌లో వివరించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం రైతులు మాట్లాడారు. నందారం గ్రామ రెవెన్యూ పరిధిలో మొత్తం 288 సర్వే నంబర్లలో 1456.26 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని ఇందులో 30 సర్వే నెంబర్లలో 124 ఎకరాల పట్టా భూమి ఉండగా, 15 సర్వే నంబర్లలో 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. మిగతా 243 సర్వే నంబర్లలో ఉన్న 932 ఎకరాల సీలింగ్ భూమిని నిషేధిత జాబితాలో అధికారులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం భూప్రక్షాళనలో పట్టాలిస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూశామని, కానీ తమకు పట్టాలు చేయకుండా ధరణి పోర్టల్ ప్రవేశపెట్టి తాము సాగు చేసుకుంటున్న భూములను నిషేధిత జాబితాలో చేర్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి చొరవ తీసుకొని సాగు చేసుకుంటున్న వారికి పట్టా పాస్‌పుస్తకాలు ఇప్పించాలని రైతులు కోరారు.

ఈ ఆసుపత్రులకు పూర్వ వైభవం ఎప్పుడో..?

● వైద్యులు లేరన్న సాకుతో ఐదేళ్లుగా మూత పడిన ఆయుర్వేద ఆస్పత్రులు ● పట్టించుకోని అధికార యంత్రాంగం



అల్లాదుర్గం మండలం ముప్పారం గ్రామంలో మూతపడిన ఆయుర్వేద ఆసుపత్రి

అల్లాదుర్గం, మే 15 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పలు వ్యాధులతో అవస్థలు పడుతున్న రోగులకు ఆయుర్వేద మందులు ఉపశమనంగా మారాయి. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఆసుపత్రులు వైద్యులు, సిబ్బంది లేక మూతపడ్డాయి. మండలంలోని ముప్పారం గ్రామంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి దివంగత కరణం రాంచంద్రరావు ప్రత్యేక చొరవతో సుమారు మూడు దశాబ్దాల క్రితం ఆయుర్వేద ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. దీంతో ఇంగ్లీష్ మందులతో నయం కాని వ్యాధుల కోసం మండలంలోని ఆయా గ్రామాల రోగులే కాకుండా సమీపంలోని రేగోడ్, పెద్దశంకరంపేట , టేక్మాల్ తదితర మండలాలకు చెందిన రోగులు ఈ ఆసుపత్రిని ఆశ్రయించేవారు. అంతటి చరిత్ర కలిగిన ఈ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో మూతపడింది. అలాగే మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఆసుపత్రిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఆరేళ్ల క్రితం వైద్యులు, సిబ్బంది లేని కారణంగా ఈ ఆసుపత్రి ఓ అటెండర్ తో కొనసాగింది. ఇది కూడా ఐదేళ్ల క్రితం మూతపడింది. ప్రస్తుత ప్రభుత్వం మూతపడిన ఈ రెండు ఆయుర్వేద ఆసుపత్రులపై దృష్టి సారించి వాటిని తెరిపించి రోగులకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోగులకు ఎంతో మేలు

దీర్ఘకాలిక రోగాలతో అవస్థలు పడుతున్న రోగులకు ఈ ఆయుర్వేద ఆసుపత్రుల మందులతో వ్యాధులు తగ్గిపోయేవి. ఎంతో పేరున్న ఈ ఆసుపత్రి మూతపడి ఏళ్లు గడుస్తున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఈ ఆసుపత్రిని తెరిపిస్తే ఎందరికో మేలు జరుగుతుంది.

ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించాలి: జిల్లా సహకార ఆడిట్ అధికారి



పెద్దశంకరంపేట సబ్ మార్కెట్ యార్డులో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్

పెద్దశంకరంపేట /చిన్నశంకరంపేట /నర్సాపూర్ /కొల్చారం మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించాలని జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్ అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు పకడ్బందిగా చేపడుతున్నామని ఆయన అన్నారు. గురువారం పెద్దశంకరంపేట మండలంలో నిర్వహిస్తున్న జొన్న, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు తరలింపులో రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈవో రవీందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేగవంతం చేయాలని తహసీల్దార్ మన్నన్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట, గవ్వలపల్లి, తదితర గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

నర్సాపూర్

నర్సాపూర్ మండలం రామచంద్రాపూర్‌లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, ధాన్యం రవాణా, ట్యాబ్ ఎంట్రీ, పుస్తక నిర్వాహణ రైతులకు సకాలంలో చెల్లింపులు తదితర అంశాలను ఆరా తీశారు.

కొల్చారం

కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి లారీల కొరత ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ తెలిపారు.

పెళ్లింట విషాదం

అనారోగ్యంతో తండ్రి మృతి



అంతిమ యాత్రలో తండ్రి మృతదేహం ముందు నిప్పు పట్టి నడుస్తున్న కూతురు

అల్లాదుర్గం, మే 15 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో కాళ్లు కడిగి కన్యాదానం చేయవలసిన కన్న తండ్రి హఠన్మరణం చెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. పెళ్లిబాజా మోగాల్సిన ఓ ఇంట్లో చావుబాజా మోగింది. ఈ విషాదకర సంఘటన గురువారం మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామంలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన నడిపోళ్ల నాగమణి, నాగయ్య దంపతులకు తేజా, అశ్విని ఇద్దరు కూతుళ్లు, తేజకు పెళ్లి సంబంధం కుదరడంతో ఈ నెల 21న వివాహం జరిపేందుకు సిద్ధమై ఏర్పాట్లలో సన్నద్ధమయ్యారు. అయితే గురువారం నాగయ్య హఠన్మరణం పొందడంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. మృతి చెందిన నాగయ్యకు కుమారులు లేకపోవడంతో చిన్న కూతురు అశ్విని అన్నీ తానై అంత్యక్రియలు చేసింది. మాజీ జడ్పీటీసీ సభ్యులు, జడ్పీటీసీ ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఖాదిరాబాద్ రమేష్, నాయకులు కోర్మణి ప్రభు తదితరులు నాగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్ఆర్ఆర్ విస్తరణ పనుల్లో వేగం పెంచండి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో భూమి ఇచ్చిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం చేశారు. వాస్తవిక మార్కెట్ విలువ ఆధారంగా నష్ట పరిహారం నిర్ణయించాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీవోలు మాట్లాడారు.

రూ.35లక్షలు విలువ చేసే ఆల్ప్రాజోలం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆల్ప్రాజోలం, నగదు

సంగారెడ్డి, మే 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని దౌండ్ పూణే నుంచి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు అక్రమంగా తీసుకువస్తున్న నిషేధిత ఆల్ప్రాజోలం ను జహీరాబాబాద్ పోలీసులు పట్టుకున్నారు. పట్టణ ఎస్సై కాశీనాథ్ వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని దౌండ్ పూణేకు చెందిన విశ్వనాథ్ మహారాష్ట్ర ఆర్టీసీబస్సులో జహీరాబాద్ పట్టణానికి నిషేధిత 750 గ్రాముల ఆల్ప్రాజోలం తీసుకువస్తున్నాడు. జహీరాబాద్‌లోని ఇంద్రప్రస్థాన్ వద్ద 65వ నెంబరు జాతీయరహదారిపై పోలీసులు బస్సును ఆపి తనిఖీలు చేయగా, అందులో ఆల్ప్రాజోలం పట్టుబడింది. పట్టణంలోని మిద్దె స్వామిగౌడ్‌కు ఆల్ప్రాజోలంను ఇచ్చేందుకు తీసుకువస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. తరలిస్తున్న ఆల్ప్రాజోలంను విలువ రూ. 35 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద 750 గ్రాముల ఆల్ప్రాజోలం, సెల్‌ఫోన్, మరో నిందితుడు మిద్దె స్వామిగౌడ్ నుంచి రూ.7.50లక్షల నగదు, కారు, సెల్‌ఫోన్‌నును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్హేర్‌లో దొంగల హల్‌చల్

● రూ. 30 వేలనగదు, 15 తులాల వెండి వస్తువులు అపహరణ

కల్హేర్, మే 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కల్హేర్‌లో దొంగలు స్వైర విహారం చేసి గ్రామంలోని నాలుగు వైపుల యదేచ్ఛగా తిరుగుతూ దొంగతనానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బాగ్‌బాన్ రాజాబీ, మరో మహిళ ఉక్క పోత భరించలేక ఇంటి తలుపులు తెరిచి నిద్రిస్తుండగా వారి మెడలో నుంచి బంగారు నగలు చోరీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ వెనుకనే ఉన్న పెర్మండ్ల భూమయ్య అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి శుభ కార్యానికి వెళ్లగా తాళం పగల గొట్టిన దొంగలు ఇంట్లోని బీరువా పగుల గొట్టి అందులో ఉన్న రూ. 30 వేలనగదు, 15 తులాల వెండి వస్తువులు దింగిలించారు. ఈ మూడిళ్లలో చోరీ చేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా ఇదే అదునుగా భావించిన దొంగలు స్వైర విహారం చేశారు. ఈ దొంగ తనాల్లో ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమిక ంగా గుర్తించారు. బాధితులు కల్హేర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైద్య సిబ్బంది అప్రమత్తతతో ఉండాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గాయత్రీ దేవి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి గాయత్రీ దేవి

నారాయణఖేడ్, మే 15 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతతో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గాయత్రీ దేవి సూచించారు. గురువారం నారాయణఖేడ్ క్లస్టర్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడానికి తోడు, వర్షాలు కూడా కురుస్తుండడంతో, ప్రజలకు వివిధ రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తతతో ఉండి సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో సంధ్యారాణి, ఎన్‌సీడీ ప్రొగ్రాం ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, హెల్త్ ఎడికేటర్ సంజీవరెడ్డి, డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, మే15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. స్కూల్ తండాకు చెందిన మూడవత్ విట్టల్ (60) వృద్ధాప్యం కారణంగా కొడుకు మోహన్‌తో కలిసి ఉంటున్నాడు. ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు విట్టల్ గురించి బంధువులను సంప్రదించినా ఫలితం లేదు. గతంలో విట్టల్ అప్పుడప్పుడు ఇదే విధంగా ఇంటి నుంచి రెండు, మూడు సార్లు వెళ్లి వచ్చేవాడు. అదేవిధంగా వస్తాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. కానీ బుధవారం సాయంత్రం తమ పొలం వద్ద విద్యుదాఘాతారికి గురై విట్టల్ మృతి చెందాడని తండాకు చెందిన చందర్ అనే వ్యక్తి కుటుబీకులకు సమాచారం అందించాడు. కుమారుడు మోహన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజు తెలిపారు.

సర్వీసు వైరు సరిచేస్తూ రైతు మృతి

హవేళిఘణపూర్, మే15 (ఆంధ్రజ్యోతి): కరెంట్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వాడి గ్రామానికి చెందిన లింగం ఎల్లయ్య (33) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. గురువారం తన పొలం వద్ద బోరు మోటార్ సర్వీసు వైరు సరిచేస్తుండగా కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించి ఇరుగుపొరుగు రైతులు వెళ్లి చూడగా అప్పటికే చనిపోయాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శివరాములు

తూప్రాన్, మే 15(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి హైవే బైపాస్ నర్సాపూర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సైకిలిస్టు మృతి చెందినట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపారు. వెల్దుర్తి మండలం శట్‌పల్లికి చెందిన తలకొక్కుల శివరాములు (45) కూలి పనులు చేస్తు జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి శివరాములు సైకిల్‌పై హైవే బైపాస్‌లోని నర్సాపూర్ రోడ్డు బ్రిడ్జిపై నుంచి వెళ్తున్నాడు. వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో సైకిలిస్టు శివరాములును ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివరాములు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు శివానందం తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

చిన్నశంకరంపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శాలిపేట గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాలే సత్యనారాయణ (41) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతంలో దుబాయ్ వెళ్లి వచ్చాడు. తనకున్న భూమిలో సాగు అంతంత మాత్రమే కావడంతో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పుల భారం అధికం కావడంతో మనస్తాపానికి గురై తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సత్యనారాయణకి భార్య కృష్ణవేణి, కుమారులు ప్రవీణ్, రాకేష్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుతో శవపంచనామ నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ గౌడ్ తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

నర్సాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు స్థానిక రేషన్ దుకాణానికి బియ్యం కోసం వెళ్లి అదృశ్యమైనట్లు ఎస్సై లింగం తెలిపారు. గాలి మల్లమ్మ(60) అనే వృద్ధురాలు ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం స్థానిక రేషన్ దుకాణం నుంచి బియ్యం కోసం వెళ్లి తిరిగి రాకపోవడంతో రెండురోజుల పాటు చుట్టుపక్కల అంతా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సౌదీలో మోసపోయి.. జీవితంపై విరక్తితో..

మిరుదొడ్డి, మే15 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువుకోసం సౌదీ వెళ్లి మోసపోయి, ఇంటికి తిరిగి వచ్చిన యువకుడు తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం మిరుదొడ్డి మండలం మోతే గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గోత్రాల రాజు, పద్మల కుమారుడు భానుప్రకాష్(27) మూడేళ్లక్రితం సౌదీదేశానికి వెళ్లాడు. అక్కడ వీసా ఇప్పిస్తామని కొందరికి దళారిని పరిచయం చేసి మోసపోయాడు. బాధితులనుంచి తప్పించుకోలేక తాగుడుకు బానిసగా మారాడు. బుధవారం రాత్రి భానుప్రకాష్ తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య

● మార్చి 17 అదృశ్యం.. నేడు మృతదేహం లభ్యం

అల్లాదుర్గం, మే 15 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడి ఇంట్లోంచి వెళ్లిపోయిన వ్యక్తి రెండు నెలల తర్వాత శవమై తేలాడు. ఈ సంఘటన అల్లాదుర్గంలో వెలుగు చూసింది. అల్లాదుర్గం ఎస్సై ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. అల్లాదుర్గానికి చెందిన కోదండం సాయిలు (35) ఇంట్లో నెలకొన్న సమస్యలతో మార్చి నెల 17న భార్యతో గొడవ పడి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ విషయమై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మార్చి 19న మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్సై తెలిపారు. గురువారం అల్లాదుర్గం గ్రామానికి చెందిన శామయ్య అనే వ్యక్తి కట్టెల కోసం పట్టణ శివారులోని ఆరే పటేల్ ప్రహ్లాద్ రావు పొలం వద్ద ఉన్న ఓ చెట్టుకు సాయిలు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించాడు. మృతదేహం కుళ్లిపోయి ఉందని, అందుకనే అక్కడే పోస్టు మార్టం చేశారని, ఈ ఘటన పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని విషం తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం మండల పరిధిలోని శానాయిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గజ్జెన లాలయ్య (52) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం సమయంలో ఇంట్లో విషం తాగి, సాయంత్రం సమయంలో ఇంటి బయట వాంతులు చేసుకుంటూ పడిపోయాడు. కుటుంబీకులు గమనించగా అప్పటికే మృతి చెందాడు.పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఫైళ్ల క్లియరెన్స్‌కు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారు

» నేను మాత్రం కాలేజీ భవనం కట్టాలని కోరా: సురేఖ



గిర్మాజిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): తమ వద్దకు వచ్చే వివిధ కంపెనీల ఫైళ్లను క్లియర్ చేసేందుకు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారంటూ మంత్రి కొండా సురేఖ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వరంగల్‌లోని కృష్ణ కాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన నూతన భవనం శంకుస్థాపన కార్యక్రమంలో గురువారం ఆమె మాట్లాడారు. "ఎంతో మంది బాలికలకు ఉన్నత విద్య అందిస్తున్న కాలేజీ తరగతి గదులు వర్షాకాలంలో జలమయమవుతున్నాయి. విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. పాతది కూలగొట్టి, కొత్త భవనం కట్టాలని కలెక్టర్ కూడా నా దృష్టికి తెచ్చారు. ఇందుకు రూ.4.5 కోట్లు ఎక్కడి నుంచి తేవాలో దారీతెన్ను తెలియలేదు. మరి నేను అటవీ శాఖ మంత్రిగా ఉన్నాను కాబట్టి.. నా దగ్గరకు కొన్ని కంపెనీల ఫైళ్లు క్లియరెన్స్ కోసం వస్తాయి. మామూలుగా అలాంటి ఫైళ్లు వచ్చినప్పుడు మంత్రులు డబ్బులు తీసుకుని క్లియర్ చేస్తారు. అప్పుడు వాళ్లతో నేను అన్నా.. మాకు ఒక్క నయాపైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. మీరు సమాజ సేవ చేయండి. మా స్కూల్ ఒకటి డెవలప్ చేయండి. మీ పేరు గుర్తుండి పోతుందని చెప్పా. అప్పుడు మా చేతుల్లో లేదు.. పై వాళ్లతో మాట్లాడతామని అరబిందో ఫార్మాకు చెందిన సదానంద రెడ్డి చెప్పారు. చివరకు సీఎస్ఆర్ నిధులు రూ.4.5 కోట్లతో కాలేజీ భవనం కడతామని చెప్పినప్పుడు నాకు సంతోషం కలిగింది" అని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. ఆ నిధులతో గ్రౌండ్, రెండంతస్థులతో 15 తరగతి గదులు, ఆడిటోరియం తరహాలో పెద్ద హాల్, 60 అధునాతన టాయిలెట్లు, నూతన ఫర్నిచర్ విద్యార్థినులకు అందుబాటులోకి రానుందని తెలిపారు.

కర్ణాటక తరహా లైసెన్స్‌డ్ సర్వేయర్లు

» తొలిదశలో 5 వేల మంది నియామకం: పొంగులేటి

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా గ్రామ స్థాయిలో లైసెన్స్ సర్వేయర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కర్ణాటకలో విజయవంతమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిదశలో 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని, ఇందుకోసం ఈ నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులకు సర్వే అకాడమీలో 50 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కర్ణాటకలో అమలవుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానంపై ఇటీవల సర్వే విభాగానికి సంబంధించిన ఇద్దరు ఉన్నతాధికారులు అధ్యయనం చేసి నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు.

ప్రకృతి విధ్వంసానికి సీఎందే బాధ్యత: కేటీఆర్

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ప్రకృతి విధ్వంసం, రూ.10 వేల కోట్ల అవినీతికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై గురువారం విచారణ సందర్భంగా అధికారులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రేవంత్ రెడ్డి మూర్ఖత్వంతో అధికారులు జైలు శిక్ష అనుభవించే పరిస్థితి నెలకొందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రేవంత్‌రెడ్డి తప్పులను ఒప్పుకుని, అక్కడ బుల్డోజర్లతో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలని, లేదంటే ఆయనకూ కోర్టు శిక్షలు తప్పవన్నారు.

చెట్లు నరకడంలో ఆంతర్యమేంటి!?

(మొదటిపేజీ తరువాయి)



పునరుద్ధరిస్తారో లేదో చెప్పాలని నిలదీసింది. లేకపోతే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సహా బాధ్యులైన అధికారులందరూ అక్కడే తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళతారని పునరుద్ఘాటించింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిలో రాష్ట్ర ప్రభుత్వం చెట్లు కొట్టేసిన అంశాన్ని ఏప్రిల్ 3న సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే. దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలో జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది. తొలుత.. తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు గత ఆదేశాలను అనుసరించి కంచె గచ్చిబౌలిలో పనులన్నీ ఆపేశామని, వైల్డ్ లైఫ్ సంరక్షణ చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. సీఈసీ నివేదిక బుధవారం రాత్రే తమకు అందిందని, దానికి బదులిచ్చేందుకు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు.

పునరుద్ధరిస్తారా!? జైలుకు పంపుతారా!?

బుల్డోజర్లతో చదును చేసిన శాటిలైట్ ఫొటోలను సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ)కి ఫారెస్ట్ సర్వీస్ ఆఫ్ ఇండియా సమర్పించిందని, అక్కడ కేవలం రెండు రాత్రుల్లోనే 104 ఎకరాలకుపైగా చదును చేశారని అమికస్ క్యూరీ పరమేశ్వర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందులో 60 శాతం మోస్తరు, దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దీంతో, చెట్ల నరికివేతకు పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? అని సీజేఐ బీఆర్ గవాయి ప్రశ్నించారు. చెట్ల ఎత్తు ఆధారంగా సెల్ఫ్ సర్టిఫికెట్ తీసుకున్నామని సింఘ్వీ బదులిచ్చారు. సెల్ఫ్ సర్టిఫికెట్ కాదని, ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ (ఈసీ) తీసుకున్నారా? అని సీజేఐ మరోసారి ప్రశ్నించారు. కేవలం 50 హెక్టార్లకుపైగా ఉంటేనే ఈసీ క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉంటుందని సింఘ్వీ తెలిపారు. అయితే, "అక్కడ అటవీ ప్రాంతంలోని చెట్లను నరికేసినట్లు ప్రాథమికంగా కనిపిస్తోంది. కంచ గచ్చిబౌలిలో పర్యావరణాన్ని పునరుద్ధరించకపోతే జైలుకు వెళ్లాల్సిందే. ఈ అంశంలో అధికారులను సమర్థించే ప్రయత్నం చేయకండి. చెట్ల నరికివేతలో ప్రధాన కార్యదర్శి సహా ఇతర అధికారుల ప్రమేయం ఉందని తెలుస్తోంది. లాంగ్ వీకెండ్‌ను ఆసరాగా చేసుకుని.. న్యాయస్థానాలకు సెలవు రోజులని తెలిసి అంత పెద్ద మొత్తంలో చెట్లను నరికేస్తారా? డజన్ల కొద్దీ బుల్డోజర్లు తీసుకొచ్చి విధ్వంసం చేస్తారా? వారాంతంలో చెట్లు నరకడంలో ఆంతర్యం ఏమిటి? సుస్థిర అభివృద్ధికి మేమేమీ వ్యతిరేకం కాదు. మిస్టర్ సింఘ్వీ.. మీరసలు బుల్డోజర్ల ఫొటోలు చూశారా? ఇది పూర్తిగా ముందస్తు ప్రణాళికతోనే జరిగినట్టు కనిపిస్తోంది. కోర్టు ధిక్కరణ నుంచి అధికారులను కాపాడుకోవాలని చూడొద్దు. ప్రభుత్వం ముందు రెండు అవకాశాలు మాత్రమే ఉన్నాయి. అడవిని పునరుద్ధరిస్తారో? లేదా అక్కడే నిర్మించే తాత్కాలిక జైలుకు సీఎస్ సహా అధికారులను పంపుతారో నిర్ణయించుకోండి" అని సీజేఐ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మొక్కలు నాటుతున్నాం: సింఘ్వీ

ఇప్పటికే అడవి పునరుద్ధరణ చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగా మొక్కలు నాటుతున్నామని ధర్మాసనానికి అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. ఈ మేరకు ఫొటోలతో కూడిన పూర్తి నివేదికను కోర్టుకు అందజేస్తామని వివరించారు. అయితే, చెట్లు నరికేసిన స్థలంలోనే మొక్కలు నాటుతున్నారా? అని సీజేఐ ప్రశ్నించారు. అయితే, అక్కడ కాకుండా మరోచోట మొక్కలు నాటుతున్నారని ప్రతివాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సింఘ్వీ అభ్యంతరం తెలిపారు. అయితే, వాదనల్లోకి వెళ్లేందుకు కోర్టు నిరాకరించింది. అక్కడ అడవిని పునరుద్ధరిస్తున్నారా? లేదా? అనేదే తమకు ముఖ్యమని స్పష్టం చేసింది. సింఘ్వీ తన వాదనలు కొనసాగిస్తూ.. ఆ స్థలంలో ఎలాంటి అభివృద్ధి చేయాలనే అంశంపై సుమారు ఏడాదిగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. అంతేతప్ప ఇది కేవలం వారాంతంలో తీసుకున్న నిర్ణయమేమీ కాదని స్పష్టం చేశారు. అయితే, చెట్ల నరికివేతను సోమవారం ఎందుకు ప్రారంభించలేదని సీజేఐ ప్రశ్నించారు. దాంతో, తమ తదుపరి నివేదికలో అన్నింటికీ స్పష్టతనిస్తామని సింఘ్వీ బదులిచ్చారు. కాగా, సీఈసీ నివేదికకు కౌంటర్ దాఖలు చేయడానికి ఎంత సమయం కావాలని సీజేఐ ప్రశ్నించగా.. జూలై వరకు సమయం ఇవ్వాలని సింఘ్వీ కోరారు. దీనికి సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి అభ్యంతరం తెలిపారు.

అలాంటి ప్రణాళికేదీ లేదు: నిరంజన్ రెడ్డి

అడవి పునరుద్ధరణకు ప్రభుత్వం వద్ద ప్రణాళికేదీ లేదని ఇంప్లీడ్ పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు రాబోయే వర్షాకాలం సరైనదని, హైదరాబాద్‌లో మాన్ సూన్ సీజన్ జూన్ 10 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ నిర్మాణాల కోసం ఆలోచన చేస్తోందని, కానీ, పునరుద్ధరణ చర్యలేమీ తీసుకోవడం లేదని తెలిపారు. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే జూలై వరకు వాయిదా కోరుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం ఇటీవల సమర్పించిన నివేదికలోని అంశాలను ప్రస్తావించేందుకు సింఘ్వీ ప్రయత్నించగా, సీజేఐ అడ్డుకున్నారు. చెట్ల నరికివేత ప్రదేశంలో జింకలు, నెమళ్లు స్పష్టంగా ఉన్నాయని, మళ్లీ దానిని కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు ఎందుకని ప్రశ్నించారు.

3 పాఠశాలలను కూల్చివేశారు: వరుణ్ ఠాకూర్

కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేత సమయంలో విజిల్ బ్లోయర్లు, విద్యార్థులపై కేసులు నమోదు చేశారని సీనియర్ న్యాయవాది వరుణ్ ఠాకూర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 200 మంది విద్యార్థులపై క్రిమినల్ కేసులు పెట్టారని, ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయని, పరీక్షలు రాయాల్సిన కొందరు విద్యార్థులు జైళ్లలో ఉన్నారని తెలిపారు. విద్యార్థులపై కేసులు కొట్టేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యా సంవత్సరం మధ్యలోనే మూడు పాఠశాలలను కూల్చివేశారని చెప్పారు. దీనిపై సీజేఐ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఈ కేసును గతంలోనూ (సీజేఐ కాకముందు) నేనే విచారించాను. ఇప్పటి వరకూ స్కూళ్ల కూల్చివేత ఆరోపణలు రాలేదు. అక్కడికి వెళ్లి పరిశీలించిన అనేక కమిటీలు కూడా తమ నివేదికల్లో ఈ అంశాన్ని ప్రస్తావించలేదు" అని వ్యాఖ్యానించారు. తాము కూడా మొదటిసారిగా ఈ ఆరోపణలు వింటున్నామని సింఘ్వీ తెలిపారు. అయితే, సుమోటో కేసుతో కలిపి దీనిని (ఐఏ) విచారించడం కుదరదని, కావాలంటే, మరో పిటిషన్ దాఖలు చేసుకోవాలని సీజేఐ సూచించారు. కాగా, ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున మోహిత్ రావు వాదనలు వినిపిస్తూ.. అక్కడ జరిగిన విధ్వంసానికి సంబంధించి తాము స్పష్టమైన ఫొటోలతో కూడిన ఆధారాలు సమర్పించామని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో, అన్ని పిటిషన్లను సుమోటోతో కలపవద్దని సీజేఐ తెలిపారు. తమ పిటిషన్ మొదటి నుంచీ ఉన్నదేనని, మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకొస్తున్నానని మోహిత్ రావు స్పష్టం చేశారు. తమ పిటిషన్‌లో బుల్డోజర్లతో చదును, అడవిని నిర్మూలించే, జంతువులు, పక్షులు అక్కడ నివాసం ఉండే ఆధారాలతో కూడిన చిత్రాలు జత చేశామని తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు. దాంతో, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌లోనే అన్నిటినీ పొందుపరిచామని సింఘ్వీ బదులిచ్చారు. అలాగయితే.. ఆ కాపీని మోహిత్ రావుకు అందజేయాలని సీజేఐ ఆదేశించారు. తదుపరి విచారణను జూలై 23కు వాయిదా వేశారు.

అటవీ ప్రాంతంగా కంచ గచ్చబౌలి భూములు

» నిర్వహణను అటవీ శాఖకు అప్పగించాలి

» సుప్రీం కోర్టుకు సీఈసీ తుది నివేదిక

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చబౌలి భూములను అటవీ ప్రాంతంగా ప్రకటించాలని కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) సిఫారసు చేసింది. ఆ భూముల నిర్వహణను అటవీ శాఖకు అప్పగించాలని కోరింది. అలాగే, అక్కడున్న జీవ వైవిధ్యం దృష్ట్యా ఆ భూములను వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 కిందకు తెచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించింది. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి సీఈసీ ఏప్రిల్‌లో మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయ తెలిసిందే. తాజాగా తుది నివేదికను సుప్రీం కోర్టుకు తాజాగా సమర్పించింది. ఇందులో అనేక కీలకమైన సిఫారసులు చేసింది. "ఆ ప్రాంతంలో కొట్టేసిన చెట్ల స్థానంలో మళ్లీ మొక్కలు నాటి దట్టమైన పచ్చదనం పెంపొందించేలా చేయాలి. వచ్చే వర్షాకాలంలోనే ఈ పని చేపట్టాలి. భూసార, జల సంరక్షణ కార్యక్రమాలను కూడా చేపట్టాలి. అక్కడి జల వనరులన్నింటినీ వెట్ ల్యాండ్స్ సంరక్షణ, నిర్వహణ నిబంధనలు-2017 ప్రకారం సంరక్షించాలి. జీహెచ్ఎంసీ ఆ ప్రాంతంలో సరైన మురుగునీటి శుద్ధి ప్లాంట్లను వచ్చే ఏడాది కాలంలో ఏర్పాటు చేయాలి" అని సూచించింది. ఇక, రాష్ట్రంలోని అటవీ భూములను గుర్తించడానికి నిపుణుల కమిటీని రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించాలని, ఆ కమిటీలో క్షేత్రస్థాయి అటవీ అధికారులు, వన్యప్రాణి నిపుణులు, జీవావరణవేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే ఏజెన్సీలు ఉండాలని పేర్కొంది. కోర్టు ఆదేశాల ప్రకారం అటవీ ప్రాంతాల్లా ఉన్నవాటిని ఈ కమిటీ గుర్తించాలని, ప్రైవేటు భూముల కంటే ప్రభుత్వ భూములను అటవీ ప్రాంతాలుగా గుర్తించే విషయంలో కమిటీ మరింత కఠినంగా ఉండాలని సిఫారసు చేసింది. రాజ్యాంగంలోని 48ఏ, 21 ప్రకరణల ప్రకారం ప్రభుత్వంపై సదరు బాధ్యత ఉంటుందని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో అటవీ భూముల్లాంటివి ఎక్కువగానే ఉంటాయని, పట్టణ ప్రాంతాల్లో అక్కడక్కడా మాత్రమే ఉంటాయని, డీమ్డ్ ఫారెస్ట్‌గా ఏ భూమిని గుర్తించాలన్న విషయంపై నిపుణుల కమిటీ ఈ వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలని తెలిపింది. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీని వేయాలని సిఫారసు చేసింది. ఇందులో పీసీసీఎఫ్, సీసీఎల్ఏ, న్యాయ నిపుణులు, పర్యావరణవేత్తలు ఉండాలని సూచించింది. ప్రభుత్వ, సంస్థలకు చెందిన భూములను అటవీ ప్రాంతాలుగా గుర్తించేందుకు ఎలాంటి పద్ధతి అనుసరించాలన్న దానిపై ఈ కమిటీ పని చేయాలని సిఫారసు చేసింది. అలాగే, సుప్రీం కోర్టు ఆదేశాలను కూడా నెరవేర్చేలా ఈ కమిటీ పర్యవేక్షించాలని సూచించింది. సీఈసీ సూచనల మేరకు కంచ గచ్చబౌలిలో తొలగించిన చెట్ల పరిమాణాన్ని నిర్ధారించేందుకు ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు అయిన రూ.14.52 లక్షల ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించాలని, ఆ మొత్తాన్ని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు చెల్లించాలని సూచించింది.

అమీన్‌పూర్‌లో కూల్చివేతల కలకలం

● శెట్టికుంట ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాల నేలమట్టం

అమీన్‌పూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పరిధి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో మళ్లీ కూల్చివేతలు కలకలం రేకెత్తించాయి. గతంలో హైడ్రా కూల్చివేతలతో సంచలనం రేకెత్తించిన అమీన్‌పూర్‌లో తిరిగి కూల్చివేతలు ప్రారంభం కావడంతో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. గురువారం మున్సిపల్ పరిధిలోని బీరంగూడా శెట్టికుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో పిల్లర్లు, స్లాబులు వేసిన నిర్మాణాలను ఎక్స్‌కవేటర్లతో నేటమట్టం చేశారు. శెట్టికుంట పరిధిలోకి వచ్చే పలు నిర్మాణాలను గతంలోనే రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. సదరు సర్వే నంబర్లలో ఎలాంటి నిర్మాణ అనుమతులు జారీ చేయడంలేదు. గతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు దొడ్డిదారిన నిర్మాణాలు చేపట్టడంపై పలు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో కూల్చివేతలకు మున్సిపల్ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. టౌన్‌ప్లానింగ్ అధికారి పవన్ నేతృత్వంలో నిర్మాణంలో ఉన్న ఇంటిని పిల్లర్లతో స్లాబ్‌ను కూల్చివేశారు. మరిన్ని బేస్‌మిట్లను తొలగించారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ టీపీవో పవన్ మాట్లాడుతూ శెట్టికుంట బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తామని హెచ్చరించారు. అయితే, ఇండ్ల మధ్య ఉన్న ప్లాటులో ఇంటిని నిర్మించుకుంటే ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని కూల్చివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు మున్సిపల్ సిబ్బందిని బతిమిలాడుకోవడం కనిపించింది.

మైనారిటీ సంక్షేమం, విద్యా ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట

● రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్‌అన్సారీ సాహెబ్



ఉత్తమ ఫలితాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తారిఖ్‌అన్సారీ, రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే15 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీల సంక్షేమం, విద్యా ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్‌అన్సారీ సాహెబ్ తెలిపారు. గురువారం మెదక్‌కు విచ్చేసిన ఆయనకు కలెక్టర్ రాహుల్‌రాజ్ పూల మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం మైనార్టీ గురుకుల కళాశాల, పాఠశాలల్లో పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమాధికారి జమ్లా నాయక్, ప్రిన్సిపల్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ హత్య కేసు ఛేదన

జోగిపేట రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన అంగన్‌వాడీ టీచర్ హత్య చేయబడిన కేసును పోలీసులు ఛేదించారు. గురువారం జోగిపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ అనిల్‌కుమార్ వివరాలను వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. పుల్‌కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ జయమ్మ(57) కనిపించడం లేదని ఆమె కుమారుడు వారం రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పోలీసులు విచారణ చేపట్టారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన పుట్ట రాములు మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా, దీనికి మధ్యవర్తిగా జయమ్మ ఉందని తెలుసుకున్న అతడి కుమారుడు పుట్ట అనిల్‌కుమార్ ఆమెను హతమార్చాలనుకున్నాడు. తన ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను కాజేస్తే తన అప్పులు తీరుతాయని భావించాడు. అనిల్‌కుమార్ అదే గ్రామానికి చెందిన డప్పు వినీత్ సహాయంతో వారం రోజుల క్రితం జయమ్మను గొంతు నులిమి హత్య చేశాడు. మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామ శివారునకు తీసుకెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించారు. అనంతరం ఆమె ఫోన్‌ను తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఉన్న చింతకుంట మంజీరా వాగులో పడవేశారు. నగలను జోగిపేటలోని పాన్ బ్రోకర్ షాప్‌లో కుదువ పెట్టారు. నిందితులు విచారణలో హత్య చేసినట్లు ఒప్పుకున్నారని సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.



కంది మండలం బ్యాతోల్‌లో ఎండలో మేత మేస్తున్న పశువులు

గ్రాసం కరువై.. పోషణ బరువై

పశుగ్రాసం కొరతతో పాడిరైతుల విలవిల

ట్రాక్టర్ గడ్డికి విపరీతమైన డిమాండ్

మేత కోసం మందలతో మైళ్ల కొద్దీ ప్రయాణం

కంది, మే 15 (ఆంధ్రజ్యోతి) : గ్రాసం కొరతతో పశుపోషణ గుదిబండలా మారింది. ఇప్పటికే కూలీల కొరత, పంట నూర్పిడి యంత్రాల వాడకం వంటి పరిస్థితులు పాడి రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. ట్రాక్టర్ గడ్డికి విపరీతంగా ఖర్చు చేయాల్సి రావడంతో విలపిస్తున్నారు. గొర్రెలు, మేకలకు పిడికెడు మేత కోసం నానా అవస్థలు పడుతున్నారు.

కంది మండలంలో చాలా మంది రైతులు పాడి పరిశ్రమపైనే ఆధారపడుతున్నారు. మండలంలోని కాశీపూర్, కలివేముల, కవలంపేట, చేర్యాల, ఇంద్రకరణ్, చెర్లగూడెం, జుల్‌కల్, బ్యాతోల్, ఆరుట్ల తదితర గ్రామాల్లో నిత్యం వందల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుంది. పశుగ్రాసం కొనలేక రైతులు దాణాపైనే ఆధారపడాల్సివస్తుంది. మరికొంత మంది రైతన్నలు తమ వ్యవసాయ క్షేత్రాల్లోనే పశుగ్రాసం పండించి నిల్వ చేసుకుంటున్నారు.

ట్రాక్టర్ గడ్డికి రూ.20 వేల వరకు

పాలపై వచ్చే రాబడి కంటే పశుపోషణపైనే వ్యయం ఎక్కువవుతుండటంతో పాడి రైతులు సతమతమవుతున్నారు. పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం గడ్డి విత్తనాలను సరఫరా చేసినప్పటికీ రోజురోజుకు పెరుగుతున్న ఎండ తాపానికి నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో కొంత వరకే ప్రయోజనం కలిగింది. మూగ జీవాల పోషణకు తప్పక ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ గడ్డి రూ.15 వేల నుంచి రూ.20 వేలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

పశుగ్రాసం పెంపకంపై కొరవడిన అవగాహన

రైతులకు పాడి పరిశ్రమ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉండటంతో గతంలో ఎక్కువ మంది పశుపోషణకు ఊతం ఇచ్చేవారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గడ్డి సాగును ప్రోత్సహించేవారు. జిల్లా వ్యాప్తంగా స్వల్ప, దీర్ఘకాలిక గడ్డి జాతుల పెంపకానికి ప్రోత్సాహం అందించేవారు. ఉపాధిహామీ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించకపోవడం, వ్యవసాయ శాఖ అధికారులు మండలంలో పర్యటించి రైతులకు సూచనలివ్వకపోవడంతో పశుగ్రాసం పెంపకంపై తగ్గిపోయింది. పశుపోషణకు ఉపయోగపడేలా ఆరుతడి గడ్డి జాతుల పంటలు వేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మేత కోసం మైళ్లకొద్దీ ప్రయాణం

రోజు రోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతలకు గ్రామాల్లో పచ్చదనం కరువై మూగజీవాలు మేత కోసం అల్లాడుతున్నాయి. మైళ్ల కొద్దీ ప్రయాణించాల్సి వస్తుంది. మేకల కాపర్లు మూగజీవాలను బతికించుకోవడానికి మందలను తోలుకొని పక్క మండలాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. గుప్పెడంత మేత కోసం తీవ్రమైన ఎండలను సైతం లెక్క చేయకుండా కాపర్లు ఎంత దూరమైన వెళ్లడానికి సిద్ధపడుతున్నారు. దీనికి తోడు నీటి కరువు వారిని బాధిస్తూనే ఉన్నది. ఒక్కోసారి మేత కోసం కిలోమీటర్ల కొద్ది వెళ్లినా సరైన గ్రాసం దొరక్క తిరిగి వాటిని తోలుకొని వెళ్లలేక మధ్యలోనే దళారులకు అమ్మాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమలాంటి మేకల కాపరులకు నీటి వసతి ఏర్పాటుతో పాటు, గ్రాసం కూడా పంపిణీ చేస్తే ఈ కష్టాల కడలి నుంచి గట్టెక్కుతామని మేకల కాపర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కంది మండలం ఇంద్రకరణ్ శివారులో మేకల మంద

మహనీయుల మార్గం అనుసరణీయం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

ములుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): మహనీయుల మార్గం అనుసరణీయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. గురువారం ములుగు మండలం బస్వాపూర్ గ్రామంలో చెలిమెల బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ రిజర్వేషన్‌లు కల్పించిన ప్రధాత బాబా సాహెబ్ అంబేడ్కర్ అయితే, ఆ రిజర్వేషన్‌ను నేటి వరకు కాపాడిన స్ఫూర్తి ప్రదాత బాబూజగ్జీవన్‌రామ్ అని పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్తులో ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్‌లు సాధించడానికి ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని అన్నారు. మహనీయుల బాటలో నడుస్తూ భవిష్యత్తులో బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడి రాజకీయాలకతీతంగా పనిచేస్తారని పేర్కొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మందకృష్ణమాదిగ, రఘునందన్‌రావు

కులమతాలకతీతంగా మెదలాలి : ఎంపీ

గ్రామీణ ప్రాంతాల్లో కులమతాల కతీతంగా ప్రజలంతా భారతీయులుగా మెదలాలని, అంబేడ్కర్ అందరివాడని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపూరి సోమన్న మాట, పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. 30 సంవత్సరాల తన పాటల ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆదాసు మహేష్, మాజీ సర్పంచ్ చిట్కుల మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సలాఖ్‌పూర్‌లో..

మద్దూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సలాఖ్‌పూర్ గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. గురువారం రాత్రి ఆయన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

కళాకారిణి బుర్ర పద్మకు జానపద పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న బుర్ర పద్మ

చేగుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మన పల్లె జానపద జాతర కార్యక్రమంలో చేగుంట గ్రామానికి చెందిన పుర్ర పద్మకు జానపద పురస్కారాన్ని అందజేశారు. ప్రశంస పత్రం అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది జానపద కళాకారులు హాజరు కాగా, అందులో ప్రతిభ కనబరిచిన బుర్ర పద్మకు పురస్కారం ప్రశంసా పత్రం అందజేశారు.

ప్రతిభా పురస్కారంతో బాధత్య పెరిగింది

రేగోడు కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్

రేగోడు, మే15 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో వరుసగా వంద శాతం ఉత్తీర్ణత సాధించిన రేగోడు కస్తూర్బా విద్యాలయానికి ప్రతిభా పురస్కారం లభించిందని, ఈ పురస్కారం బాధ్యతను పెంచిందని ప్రిన్సిపాల్ స్వయంప్రభ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మెదక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈవో రాధాకిషన్ పురస్కారాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనూ మంచి ర్యాంకులు సాధిస్తామని తెలిపారు. కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ కోర్స్ ప్రారంభమైందని, ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులలో 80 సీట్లు ఉన్నాయని తెలిపారు. హాస్టల్ వసతి ఉన్నందున విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్నేషనల్ జర్నల్‌లో బండి శ్రీకాంత్ పరిశోధన



సిద్దిపేట కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : టీఎస్ ఎస్సీ స్టడీ డైరెక్టర్, సిద్దిపేట రావురుకుల గ్రామానికి చెందిన డాక్టర్ బండి శ్రీకాంత్ బ్రెస్ట్ క్యాన్సర్‌పై చేసిన పరిశోధనకు సంబంధించిన జర్నల్ ప్రముఖ ఇంటర్నేషనల్ సైన్స్ జర్నల్ ఎల్సీవేర్‌కు ఎంపికైంది. ఎల్సీవేర్ జర్నల్‌కు చెందిన ఇంటర్నేషనల్ జనరల్ ఆఫ్ బయోలాజికల్ మాక్రోమాలిక్యూల్స్‌లో పరిశోధన పత్రం ప్రచురితమైంది. ప్రపంచంలోనే ముఖ్యమైన ఈ సైన్స్ జర్నల్‌లో శ్రీకాంత్ పరిశోధన ప్రచురితమైనందుకు ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ సీనియర్ ప్రొఫెసర్ మాధవి, యూనివర్సిటీ అధ్యాపకులు, మిత్రులు, గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

న్యూస్ బాక్స్

పీహెచ్‌సీల్లో జేఈ వ్యాక్సిన్ కొరత

మద్దూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో జేఈ (జపనీస్ ఎన్సెఫాలిటిస్) వ్యాక్సిన్ కొరత వేధిస్తోంది. మెదడువాపు వ్యాధి నివారణకు జేఈ ఇంజక్షన్ అందుబాటులో లేకపోవడంతో చాలామంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఆస్పత్రికి వచ్చేవారికి రాష్ట్రంలోని ఏ ఆస్పత్రుల్లోనూ లేదంటూ సిబ్బంది చెప్పడంతో ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. 16నుంచి 24 నెలల్లో వేసే డీపీటీ బూస్టర్ ఫస్ట్ డోస్, మీసెల్స్ సెకండ్ డోస్, ఏపీవీ బూస్టర్ డోస్‌తో పాటు జేఈ సెకండ్ వేయాల్సి ఉంటుంది. కానీ జేఈ సెకండ్ డోస్ అందుబాటులో లేదు. ఈ విషయమై వైద్యాధికారి రజితను వివరణ కోరగా ప్రస్తుతం అందుబాటులో లేదని చెప్పారు. రాగానే ఎవరికైతే వేయలేదో వారికి సమాచారం అందించి వేస్తామన్నారు.

హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి

బెజ్జంకి, మే 15 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 22న కరీంనగర్ జిల్లా కేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు కోరారు. గురువారం బెజ్జంకిలో హిందూ ఏక్తా యాత్ర వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

తొగుట, మే 15(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన 13 మందికి ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో లబ్ధిదారులకు 6.25 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి వరం లాంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు స్వామి, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ విజయ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎక్సైజ్ సీఐ

చేర్యాల, మే 15(ఆంధ్రజ్యోతి): చేర్యాల ఎక్సైజ్ సీఐగా పి.నర్సింహులు విధుల్లో చేరారు. గురువారం కార్యాలయంలోని రికార్డులలో సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. సీఐ మహేంద్రకుమార్ అనంతరం ఎవరూ పోస్టింగ్ పొందకపోవడంతో చాన్నాళ్లుగా ఎస్ఐ సురేశ్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఎట్టకేలకు పి.నర్సింహులు పోస్టింగ్ పొంది విధుల్లో చేరారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణ గౌడసంఘం అధ్యక్షుడు పచ్చిమడ్ల సిద్దిరాములు, ప్రతినిధులు గుడాల ఐలయ్య, కూరెళ్ల యాదగిరి, కక్కిర్ల సత్యనారాయణ, బండి సుదర్శన్, పచ్చిమడ్ల వెంకటయ్య తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

జిల్లా దిశబోర్డు సభ్యుడిగా ప్రవీణ్



సిద్దిపేట జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా దుబ్బాకకు చెందిన బీజేపీ నాయకుడు సుంకు ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. జిల్లా స్థాయిలో కేంద్రప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణ, సమన్వయం లక్ష్యంగా ఏర్పాటు చేసిన దిశ కమిటీలో స్థానం కల్పించేందుకు మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు కృషి చేశారు. ఈసందర్భంగా రఘునందన్‌రావుకు ప్రవీణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో గ్రామీణ అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. కుంటుపడిన మున్సిపాలిటీల ప్రగతి కోసం కృషి చేస్తాననీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కల్లాలు లేక రైతుల ఇక్కట్లు

- ప్రభుత్వ భూమిలో మార్కెట్‌యార్డు, సీసీ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయాలి
- బందారంలో కబ్జాకు గురవుతున్న సర్కార్ భూమిని కాపాడాలని వినతి



బందారం లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు, మార్కెట్ యార్డు నిర్మించాలని వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు (ఫైల్)

కొండపాక, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం ఆరబోసుకోవడానికి కల్లాలు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఆయా గ్రామాల్లో సరైన స్థలాలు లభ్యం కాకపోవడంతో కేంద్రాల ఏర్పాటు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ భూమి ఉన్న గ్రామాల్లో అందులోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అయితే పలుచోట్ల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ అది కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు తగినవిధంగా లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ భూమి ఉన్న గ్రామాల్లో మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసి సీసీతో కల్లాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బందారంలో ప్రభుత్వ భూమిని కాపాడాలి

మండలంలోని బందారం గ్రామంలో 643/1 సర్వే నంబర్‌లో 19 ఎకరాల 32గుంటల ప్రభుత్వ భూమి రికార్డుల ప్రకారం ఉంది . ఇందులో సగానికి పైగా కబ్జాకు గురైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మిగతా భూమిలో రైతులు ధాన్యం కుప్పలు పోసుకొని ఆరబెట్టుకుంటున్నారు. ఇదే భూమిలో కొనుగోలు కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని సర్వే చేయించి శాశ్వత ప్రాతిపదికన మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని, కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు ఇటీవల అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు అవకాశం

ప్రభుత్వ భూమిలో మార్కెట్ యార్డు కల్లాలను ఏర్పాటు చేస్తే, వర్షాలు కురిసినప్పుడు రైతులకు ఎక్కువ నష్టం వాటిల్లదని రైతులు చెబుతున్నారు. అదే విధంగా రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. కల్లాల ఏర్పాటుతో ఇలాంటి ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉండదన్నారు. మార్కెట్‌యార్డులో సీసీ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయాలని, మిగతా భూమిలో గ్రామానికి ప్రభుత్వపరంగా అవసరమైన భవనాలను, డంపింగ్ షెడ్డు నిర్మించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతున్నారు. మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన రైతులు గతంలో పలుమార్లు అధికారులకు వినతి పత్రం సైతం అందజేశారు.

మార్కెట్ యార్డు నిర్మించాలి



బందారం గ్రామంలో సుమారు 19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో సర్వే చేయించి మార్కెట్ యార్డు, సీసీ ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. మిగతా భూమిలో గ్రామానికి ప్రభుత్వ అవసరాలకు అవసరమయ్యే వాటిని నిర్మించాలి. ధాన్యాన్ని ఎక్కడపడితే అక్కడ ఆరబోయడం వల్ల వర్షం కురిసినప్పుడు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మార్కెట్ యార్డులో సీసీ ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుంది.

- శ్రీనివాస్ రెడ్డి, బందారం రైతు

మహిళల రక్షణకు షీ టీం ప్రత్యేక సేవలు

● గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు మహిళా చట్టాలపై అవగాహన



నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ కిషన్

సిద్దిపేట రూరల్/హుస్నాబాద్ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి); ప్రజలకు, మహిళల రక్షణకు షీ టీం ప్రత్యేక సేవలు అందిస్తుందని, మహిళలకు ఏ రకమైన ఇబ్బందులు ఉన్నా మౌనం వీడి పోలీసులకు సమాచారం ఇవ్వాలని షీ టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ కిషన్, ఏఎస్ఐ మణెమ్మ పేర్కొన్నారు. గురువారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో, హుస్నాబాద్ మండలం మడద గ్రామంలోని ఉపాధి హామీ పని ప్రదేశాల వద్దకు షీటీం బృందాలు వెళ్లి కూలీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు మీకు ఫోన్ చేస్తే మీ వ్యక్తి గత వివరాలు వారికి వెల్లడించవద్దని సూచించారు. గ్రామాల్లో డ్రగ్స్ గంజాయి ఇతర మత్తు పదార్థాల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు ఒంటిపై బంగారం ఉంటే దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా సైబర్‌నేరం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వేసవి కాలంలో ఇంటికి తాళాలు వేసి డాబాపై పడుకునేవారు జాగ్రత్తగా మెదలాలన్నారు. జక్కాపూర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డి, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, కూలీలు తదితరులు పాల్గొన్నారు. మడద గ్రామంలో షీ టీం కానిస్టేబుళ్లు సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ తదితరులు అవగాహన కల్పించారు.



మడదలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ మణెమ్మ



యాదగిరిగుట్ట బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

హుస్నాబాద్ నుంచి యాదగిరి గుట్టకు బస్సు

హుస్నాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నుంచి యాదగిరి గుట్టకు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సును గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ బస్సు ప్రతి రోజూ ఉదయం 6.30, సాయంత్రం 4.25 గంటలకు హుస్నాబాద్ నుంచి యాదగిరి గుట్టకు, యాదగిరి గుట్ట నుంచి ఉదయం 9.05, సాయంత్రం 6.50 గంటలకు హుస్నాబాద్‌కు వస్తుందని డిపో మేనేజర్ వెంకన్న తెలిపారు. అలాగే ఇదే బస్సు 11.30 గంటలకు హుస్నాబాద్ నుంచి వేములవాడకు, మధ్యాహ్నం 2 గంటలకు వేములవాడ నుంచి హుస్నాబాద్‌కు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ తిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ, ఎండి హసన్, పూదరి శ్రీనివాస్, రాధ, మహేందర్ తదితరులున్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కొండపాక, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్ నర్సయ్య కోరారు. గురువారం ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెలో గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎర్ర సత్యం, ఏ.నర్సింలు గ్రామ పంచాయతీ వర్కర్స్ మండల అధ్యక్షుడు అరుట్ల నర్సింలు, ఉపాధ్యక్షులు తలారి ఐలయ్య, సహాయ కార్యదర్శి దాసరి రాజు, నాయకులు జంజీరపు మల్లేశం, కనకయ్య, తలపాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి



కొడకండ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

గజ్వేల్, మే 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. మండలంలోని కొడకండ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేలా నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ భార్గవ్ తదితరులున్నారు.

మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎల్లంకి వెంకట్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి పార్టీ సభ్యత్వం ఇన్సూరెన్స్ కలిగి ఉన్నందున రూ. 2లక్షలు మంజూరైనట్టు మాజీమంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కును మాజీమంత్రి అందజేశారు. వెంకట్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వివేకానంద విగ్రహం ధ్వంసానికి నిరసనగా నంగునూరులో ధర్నా, రాస్తారోకో



విగ్రహం వద్ద గ్రామస్థుల ఆందోళన

నంగునూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): నంగునూరులో స్వామి వివేకానంద విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు గురువారం ఆందోళన చేపట్టారు. బీజేపీ, హిందూవాహిని ఆధ్వర్యంలో నంగునూరు బంద్‌కు పిలుపునిచ్చారు. కిరణా వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. అంతకు ముందు వివేకానంద విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ, హిందూవాహిని ఆధ్వర్యంలో నంగునూరులో ర్యాలీని చేపట్టారు. ర్యాలీ అనంతరం వివేకానంద చౌరస్తాలో రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేపట్టారు. రాస్తారోకోకు బిజేపి జిల్లా మాజీ అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మద్దతు తెలిపారు. గ్రామస్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రాజగోపాల్ పేట ఎస్ఐ ఎండీ ఆసిఫ్, అక్కడికి చేరుకొని నిందితులను త్వరలోనే పట్టుకొని శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో హిందూవాహిని మండల అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కోల సతీష్ గౌడ్, తిరుపతి రెడ్డి, శివ గౌడ్, తుపాకుల నరేష్, చెలికాని యాదగిరి తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో దీక్షధారులకు గాయాలు

చేర్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన హనుమాన్ దీక్ష మాలధారణస్వాములకు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆకునూరు గ్రామం నుంచి 21 మంది హనుమాన్ మాలాధారణ స్వాములు కొండగట్టు అంజనేయస్వామి ఆలయానికి కాలినడకన బయలుదేరారు. ఈ క్రమంలో గురువారం వేకువజామున తంగళ్లపల్లి సమీపంలో ఓ వృద్ధుడు ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపు తప్పి మాలధారణ స్వాములను ఢీ కొట్టడంతో ఇరువురు స్వాములు ప్రశాంత్, సురేశ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ప్రశాంత్ చేయి విరగగా, సురేశ్ కాలు విరిగింది. ఘటనాస్థలం నుంచి స్వాములను హుటాహుటిన సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ సంఘటనతో స్వాములు తిరిగి గ్రామానికి చేరుకున్నారు.

ఉరేసుకుని యువతి బలవన్మరణం

మిరుదొడ్డి, మే 15(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మండలంలోని ధర్మారం గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన చెప్యాల సౌమ్య(18) అనే యువతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. గురువారం కుటుంబీకులు శుభకార్యానికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో సౌమ్య ఉరేసుకుని ఆత్యహత్యకు పాల్పడింది. కుటుంబీకులు తిరిగి వచ్చేసరికి సౌమ్య మృతదేహం కనిపించింది. ఈ మేరకు మిరుదొడ్డి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుప్రమాదంలో ఇరువురికి గాయాలు

మద్దూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి కిందపడిన సంఘటనలో భార్య, భర్తలిరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం మండలంలోని సలాక్‌పూర్ గ్రామశివారులో జరిగింది. వంగపల్లి గ్రామానికి చెందిన బొడికె భూమయ్య, తన భార్య వజ్రమ్మతో కలిసి బైక్‌పై చేర్యాల నుంచి ఇంటికి తిరుగుప్రయాణమయ్యారు. మార్గమధ్యలో సలాఖ్‌పూర్ శివారు క్రాస్‌రోడ్డు వద్ద అడ్డువచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఇరువురికి తీవ్ర గాయాలు కాగా స్థానికుల పోలీసులకు సమాచారం అందించారు. మద్దూరు ఎస్ఐ ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందికి జరిమానా.. ఒకరికి జైలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మంది పట్టుబడ్డారు. నిందితులను గురువారం ఆయా కోర్టుల్లో ప్రవేశపెట్టగా జరిమానా విధిస్తూ న్యాయాధికారులు తీర్పు చెప్పారు. అందులో ఒకరికి జైలుశిక్ష విధించారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనతనిఖీలు నిర్వహించగా 8మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం రూ.14,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురు పట్టుబడ్డారు. నిందితులను గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతి గౌడ్ ఎదుట కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ అనంతరం వారికి రూ.7వేల జరిమానా విధించారు. వారిలో ఒకరికి జరిమానాతో పాటు 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్ యాదవ్, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి మర్కంటి ఏగొండ మాట్లాడుతూ... గత మూడు రోజుల నుంచి వాతావరణశాఖ వర్షాలు ఉన్నాయని మార్కెట్ పాలక వర్గానికి, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసినా ఎలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టలేదన్నారు. జల్లి మిషన్లు నాలుగు ఉండగా రెండే నడుస్తున్నాయని, మిగతావి బ్రేక్‌డౌన్‌లో ఉన్నాయన్నారు. వారితో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకట్‌రెడ్డి, నాయకులు నాయిని సందీప్, మద్దూరి నర్సింహ, మైస విజయ్ ఉన్నారు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



రాయపోల్‌లో శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న యువకులు

రాయపోల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు పనులకు గురువారం గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. విగ్రహ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. త్వరలోనే ఇక్కడ శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తాము శివాజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుంటామని గ్రామ యువకులు తెలిపారు.

కొమురవెల్లిలో సంక్షేమ హాస్టల్ ఏర్పాటుచేయాలి

చేర్యాల, మే 15(ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలకేంద్రంలో ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం కొమురవెల్లిలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ దీక్షను ప్రారంభింపచేసిన అనంతరం మాట్లాడారు. ఈప్రాంత విద్యార్థులకు న్యాయం చేసేందుకు ప్రజాప్రతినిధులు చొరవ వహించాలని కోరారు. ప్రభుత్వం సంక్షేమహాస్టల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆముదాల రంజిత్‌రెడ్డి, తాడూరి భరత్‌కుమార్, తాడూరి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు,

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

బెజ్జంకి, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ఏవో సంతోష్ అన్నారు. మండలంలోని తోటపల్లిలో గురువారం ఆయిల్ పామ్ పంట సాగు పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు పై రైతులు మొగ్గు చూపాలన్నారు. మండలంలో 423 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా అకాల వర్షాలు కురిసిన ఎలాంటి నష్టం ఉండదని, కోతులు, అడవి పందుల బెడద ఉండదన్నారు. ఒక్కసారి పంట సాగు చేస్తే 4 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వరకు పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విజయ్, రైతులు పాల్గొన్నారు.

అందరూ అక్షరాస్యులుగా ఎదగాలి: ఎంఈవో

కుకునూరుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): చదువుకు వయసుతో పనిలేదని, ఏ వయసు వారైనా విద్యను అభ్యసించవచ్చని తెలిపారు. గురువారం కుకునూరుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో బచ్చలి సత్తయ్య మాట్లాడుతూ వయసుతో పనిలేకుండా అందరూ విద్యను నేర్చుకొని సమాజంలో సమానమైన అవకాశాలు పొందవచ్చని తెలిపారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం కోసమే ఉల్లాస్ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. ఉల్లాస్ కార్యక్రమం ఈ నెల 25 వరకు గ్రామాల్లో సర్వే చేసి జాబితా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఏపీఎం ముగ్దుమ్‌అలీ మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళాసంఘాల అధికారులు ఉల్లాస్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏపీవో సీసీ, వీవోఏలు, మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రాలలో హనుమాన్ శోభాయాత్ర




కోహెడ మండలం సముద్రాల గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర, నంగునూరులో హనుమాన్ భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న ఏసీపీ మధు

కోహెడ, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రాల గ్రామంలో హనుమాన్ మాలధారణ చేసిన స్వాములు హనుమాన్ చిత్రపటంతో గురువారం శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పెరుమాళ్ల అభయాంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. ఊరేగింపులో భక్తుల భజనలు, పాటలు, స్వామివారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణ నెలకొన్నది. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్షా పరులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఫ్రెండ్లీ పోలీస్‌కు స్ఫూర్తి..

నంగునూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): చట్టాల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులు మేము సైతం అంటూ హనుమాన్ దీక్ష భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి ఫ్రెండ్లీ పోలీస్ స్ఫూర్తిని చాటుకున్నారు. గురువారం ఓ కేసు విషయంలో నంగునూరు గ్రామానికి వెళ్లిన పోలీసులు ఫ్రెండ్లీ స్ఫూర్తితో హనుమాన్ దీక్ష భక్తులకు ప్రసాదవితరణ చేయాలని యోచించారు. అనుకున్నదే తడవుగా గ్రామంలోని ఆలయంలో అందరినీ కూర్చోబెట్టి అప్పటికప్పుడు భిక్ష ఏర్పాటు చేశారు. సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహ్మద్ ఆసిఫ్ హనుమాన్ భక్తులకు దగ్గరుండి మరీ భిక్ష ఏర్పాట్లను చూసుకున్నారు. ఈ సందర్భంగా వారు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత అలవర్చుకోవడం వల్ల మానసిక ప్రశాంతతో పాటు శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి ఫ్రెండ్లీ పోలీస్‌కు సార్థకత చేకూర్చారని పలువురు అభినందించారు.

మతసామరస్యం చాటిన ముస్లిం యువకుడు

చేర్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన ముస్లిం వ్యక్తి అన్వర్ మత సామరస్యాన్ని చాటుకున్నాడు. గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారణ స్వాములకు గురువారం మధ్యాహ్నం భిక్ష ఏర్పాటుచేసి స్వయంగా వడ్డించాడు. కుల, మతాలు, సాంప్రదాయాలు వేరేఅయినా అంతా ఒక్కటేనని చాటడంపట్ల స్థానికులు అభినందించారు.



హనుమాన్ దీక్ష స్వాములతో ముస్లిం యువకుడు అన్వర్